సాక్షి
పల్నాడు
ఆదివారం । 5 । జనవరి । 2025



హుండీ కానుకల లెక్కింపు

కారెంపూడి: స్థానిక చెన్నకేశవస్వామి హుండీ కానుకల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఏడాదికిగాను రూ.1,31,046 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ హనుమంతరావు తెలిపారు.



హంపికి అభినందనలు

తాడేపల్లి రూరల్: ప్రపంచ మహిళా చెస్ విజేత కోనేరు హంపిని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు కొలనుకొండలోని ఆమె నివాసంలో శనివారం కలిసి అభినందించారు.



కల్యాణ మహోత్సవాలు

గుంటూరు రూరల్: గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి పెద్దగుడిలో దశావతార కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం స్వామిని పరశురామ అవతారంలో అలంకరించారు.

భళా.. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

- నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి : కలెక్టర్
- ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, డీఈవో చంద్రకళ
- విజేతలకు బహుమతులు అందజేసిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు., జాయింట్ కలెక్టర్ సూరజ్



విజేతలతో కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్, డీఈవో చంద్రకళ

నరసరావుపేట రూరల్: నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో నిర్వహించారు. ప్రదర్శన ప్రారంభ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ నేటి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం ఎక్కువగా ఉందని తెలిపారు. జ్ఞాపకశక్తి కూడా అధికంగా ఉండటం వల్ల ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. పాఠ్యాంశాల కోసం విద్యార్థులు సెల్‌ఫోన్ మీద ఆధారపడుతున్నారని, ఇది వారిపై మానసిక ఒత్తిడిని తీసుకు వస్తోందని చెప్పారు. పుస్తక పఠనంపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. సైన్స్, టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందుతోందని, దీనిపై విద్యార్థులు చిన్నతనం నుంచే అవగాహన పెంచుకోవాలని తెలిపారు. సైన్స్, టెక్నాలజీతో పాటు సైబర్ నేరాలు పెరుగుతున్నాయి, వీటిపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ప్రకృతి వనరులను సంరక్షించుకుంటూ భవిష్యత్ తరాలకు అందించేందుకు విద్యార్థులు కృషిచేయాలని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను పరిశోధనల వైపు దృష్టి సారించే విధంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో సాంకేతిక జ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

వైజ్ఞానిక ప్రదర్శనలో మూడు విభాగాలలో 66 నమూనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయుల విభాగంలో 14, విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో 27, బృంద విభాగంలో 25 నమునాలను ప్రదర్శనలో ఉంచారు. దీంతో పాటు 15 పాఠశాలల నుంచి 300 పుస్తకాలను విద్యార్థులు ప్రదర్శనకు తీసుకువచ్చారు. 23 మండలాల నుంచి 8,9,10 విద్యార్థులతో కూడిన 23 బృందాలు క్విజ్ పోటీలో పాల్గొన్నాయి. ఒక్కో బృందానికి ముగ్గురు చొప్పున 69మంది పోటీలకు హాజరయ్యారు.

విజేతలకు బహుమతి ప్రదానం

వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్‌లు బహుమతులు అందజేశారు. వ్యక్తిగత విభాగంలో పి.వి.నాగార్జున (విజయపురిసౌత్), పి.దిలీప్(దాచేపల్లి) బృంద విభాగంలో కె.బాలాజిఅజయ్, వై.విజయ భాస్కరరెడ్డి(విప్పర్లరెడ్డిపాలెం), కె.రవిశంకర్, డి.విష్ణువర్ధన్(అడిగొప్పల), ఉపాధ్యాయుల విభాగంలో వై.మణికంఠ(దొడ్లేరు), ఎన్.ఎం.ఎల్. కాత్యాయణి (గణపవరం), క్విజ్ పోటీలలో పసుమర్రు జెడ్పీ హైస్కూల్, బ్రహ్మణపల్లి జెడ్పీ హైస్కూల్, గణపవరం జెడ్పీ హైస్కూల్స్ విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో సత్తెనపల్లి డెప్యూటీ ఈఈవో ఎన్.ఏసుబాబు, ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్తా, ఎంఈవో నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు రామిశెట్టి, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్ సీతాపతి పాల్గొన్నారు.



ఎగ్జిబిట్‌తో విద్యార్థులు



ప్రదర్శనలో నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, డీఈవో

ఏఎంసీ నూతన పాలకవర్గాలపై కసరత్తు

- సంక్రాంతి నాటికి పదవుల భర్తీకి నిర్ణయం
- పల్నాడు జిల్లాలో 12 వ్యవసాయ మార్కెట్ కమిటీలు



సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం

సత్తెనపల్లి: జిల్లాలోని 12 వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల నూతన పాలకవర్గాలను సంక్రాంతి నాటికి భర్తీ చేయాలని కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పాత విధానం అమలు చేయాలా? కొత్తగా మార్గదర్శకాలను ఇస్తారా? అని ఆ శాఖ అధికారులు తర్జనభర్జన పడ్డారు. మరో వైపు పదవుల రిజర్వేషన్ల ప్రక్రియపై కసరత్తు కూడా పూర్తి కావడంతో అధికారికంగా ఉత్తర్వులు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. మరో పది రోజుల్లో పదవుల పందేరం జరగనుంది. కాకపోతే ఆశావాహులు ఇప్పటికే ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలపై ఇప్పటికే ఒత్తిడి తీసుకువస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నేతలకు ఏ స్థానం ఇవ్వాలి, సభ్యులుగా ఎంతమందికి అవకాశం ఇవ్వాలనే దానిపై నేతల్లో జోరుగా చర్చ జరుగుతోంది. జిల్లాలో చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, నరసరావుపేట, వినుకొండ, క్రోసూరు, మాచర్ల, రొంపిచర్ల, ఈపూరు, రాజుపాలెం, దుర్గి, గురజాల వ్యవసాయ మార్కెట్ కమిటీలు పని చేస్తున్నాయి.

15 మంది సభ్యులతో కమిటీ

- ప్రతి కమిటీలో అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, సన్నకారు రైతులు, పశుపోషకులు, వర్తకులు కలిపి 15 మంది సభ్యులుగా ఉంటారు. మరో నలుగురు అధికారులు, ఆయా మార్కెట్ యార్డు పరిధిలోని ఎమ్మెల్యే కూడా సభ్యుడిగా ఉంటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రిజర్వేషన్ల విధానం తీసుకువచ్చారు. మహిళలకు పెద్దపీట వేసి ప్రాధాన్యమిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలను భాగస్వాములను చేశారు. గత ప్రభుత్వం తరహాలో రిజర్వేషన్ల విధానం అమలు చేయడానికి ప్రస్తుత కూటమిలోని కీలక నేతలు వ్యతిరేకించి, తాము సిఫార్సు చేసిన వారికే పాలకవర్గంలో చోటు కల్పించాలని పట్టు పట్టారు. అయినప్పటికీ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చర్చలు జరపడంతో చివరకు రిజర్వేషన్ విధానం ఖరారు చేశారు.

కలెక్టర్ నేతృత్వంలో రిజర్వేషన్లు ఖరారు

ప్రస్తుతం జిల్లాలోని 12 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను కలెక్టర్ నేతృత్వంలో ఖరారు చేయగా ఎమ్మెల్యేలు అధికారికంగా వాటిని ప్రకటించాల్సి ఉంది. ఈ క్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తెనపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఓసీ మహిళకు, రాజుపాలెం బీసీ జనరల్‌కు ఖరారయ్యాయి. దీంతో చైర్మన్ పదవి తనకంటే తనకంటూ పెద్దమక్కెన, గుడిపూడి గ్రామాలకు చెందిన నేతలు పట్టుబడుతున్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో శుక్రవారం బలాబలాలు నిరూపించుకునే స్థాయికి చేరుకున్నారు.

- పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మైనార్టీలు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇలా జిల్లాలో తమ వర్గానికి చైర్మన్ పదవి కేటాయించాలంటే తమ వర్గానికి కేటాయించాలని కీలక నేతలు పట్టుబడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలు మల్లగుల్లాలు పడుతున్నారు.

క్రైస్తవులు హృదయ శుద్ధి కలిగిఉండాలి



డాక్టర్ గాలి బాలిని సత్కరిస్తున్న గురువులు

- గుంటూరు పూర్వ పీఠాధిపతులు, కడప అపొస్తలిక పాలనాధికారి డాక్టర్ గాలి బాలి
- ఘనంగా గురుత్వ వజ్రోత్సవం, పీఠాధిపత్య రూబీ జూబ్లీ వేడుకలు
- వేలాదిగా తరలివచ్చిన క్రైస్తవులు



వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

పెదకూరపాడు: క్రైస్తవులు హృదయ శుద్ధి కలిగి, క్రీస్తు మార్గంలో నడవాలని గుంటూరు పూర్వ పీఠాధిపతులు, కడప అపొస్తలిక పాలనాధికారి మహా ఘన, రైట్ రెవరెండ్ డాక్టర్ గాలి బాలి తెలిపారు. ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవంలో భాగంగా శనివారం డాక్టర్ గాలి బాలి గురుత్వ వజ్రోత్సవం, పీఠాధిపత్య రూబీ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక దివ్యపూజ బలిని డాక్టర్ గాలి బాలి నిర్వహించారు. 20 సంవత్సరాలు గురువుగా, 40 సంవత్సరాలు ఉమ్మడి గుంటూరు జిల్లా పీఠాధిపతులుగా దైవసేవలు అందించిన ఆయనకు పాటిబండ్ల ముగ్గురు రాజుల దేవాలయ సంఘ పెద్దలు, సంఘస్తులు, గ్రామ ప్రజలు, కన్య స్త్రీలు, విచారణ గురువులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ గాలి బాలి మాట్లాడుతూ చెడు వ్యసనాలు , చెడ్డ ఆలోచనలు లేకుండా దైవ చింతనతో ఆధ్యాత్మిక జీవనం సాగించాలని తెలిపారు. పుట్టిన గ్రామానికి సేవలు అందించాలనే సంకల్పంతో అనేక దైవ సేవలు, పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషితో పాటు సామాజిక సేవలను అందించామని గుర్తు చేసుకున్నారు. గురుత్వం దేవుడు ఇచ్చిన వరమని, అనుక్షణం అందులో జీవించడం మహా సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గాలి బాలి జీవిత విశేషాలను ఆడియో వీడియో రూపంలో ప్రదర్శించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యబలి పూజ అనంతరం వందకు పైగా గురువులు, మఠకన్యలు, సంఘ పెద్దలు, కడప, అనంతపురం, పల్నాడు, గుంటూరు, హైదరాబాద్, విదేశాల నుంచి వచ్చిన భక్తులు డాక్టర్ గాలి బాలిని సత్కరించారు.

గ్రామానికి అంకితం

గురుత్వ వజ్రోత్సవం, పీఠాధిపత్య రూబీ జూబ్లీ వేడుకల వేళ, ముగ్గురు రాజుల ఆలయ శత వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ గాలి బాలి తన తల్లి దండ్రులు గాలి చిన్నప్పరెడ్డి శౌరమ్మ జ్ఞాపకార్థం నిర్మించిన నూతన కల్యాణ మండపం, భోజన శాల భవనాన్ని ప్రారంభించి గ్రామానికి అంకితం చేశారు. గ్రామంలో శుభకార్యాలను గ్రామస్తులు రోడ్లపై చేయడం చూశానని, అందుకే ఈ భవనాలు నిర్మించి గ్రామానికి అంకితం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని క్రైస్తవులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇందులో కార్యక్రమాలు చేసుకోవచ్చని చెప్పారు. స్థానిక విచారణ గురువులు, సంఘ పెద్దల సమన్వయంతో కల్యాణ మండపం, భోజనశాలను నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక విచారణ గురువులు చిన్నాబత్తిన హృదయ కుమార్, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. చివరగా అన్నదానం నిర్వహించారు.

ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

నరసరావుపేట రూరల్: విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు డిసెంబర్ నెల జీతాలు అందలేదని, వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. డిసెంబర్ జీతాలు కొన్ని ఉద్యోగ శాఖల పెన్షనర్లకు చెల్లించారని, విద్యాశాఖలోని దాదాపు రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు నేటి వరకు అందలేదని తెలిపారు. బ్యాంక్ లోన్లు, ఈఎంఐల చెల్లింపులు, నూతన సంవత్సరం ఖర్చుల రీత్యా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని అసోసియేషన్ నాయకులు పమ్మి వెంకటరెడ్డి, బెజ్జం సంపత్‌బాబు, కొమ్ము కిశోర్‌లు కోరారు.

సంక్రాంతికి 137 స్పెషల్ బస్సులు

- ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్.శ్రీనివాసరావు
- సాధారణ బస్సు చార్జీలే అమలు



నరసరావుపేట: సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి ప్రయాణికులను సొంత గ్రామాలకు చేర్చేందుకు ప్రత్యేకంగా 137 బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వీటిలో సాధారణ బస్సు చార్జీలే వసూలు చేస్తారని చెప్పారు. స్థానిక డిపోలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈనెల తొమ్మిదో తేదీ నుంచి 13వ తేదీ వరకు ఐదురోజుల పాటు జిల్లాలోని ఆయా డిపోల నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్‌ల మధ్య బస్సులు నడుస్తాయని తెలిపారు.

- 9వ తేదీన 15 బస్సులు నడుస్తాయి. ఇందులో నరసరావుపేట డిపో నుంచి అల్ట్రా డీలక్స్ బస్సులు రెండు, మాచర్ల డిపో నుంచి సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సు ఒక్కొక్కటి చొప్పున నడుస్తాయి. చిలకలూరిపేట నుంచి మూడు సూపర్ లగ్జరీలు, సత్తెనపల్లి నుంచి ఒకటి, పిడుగురాళ్ల నుంచి రెండు ఎక్స్‌ప్రెస్‌లు, వినుకొండ నుంచి ఐదు అల్ట్రా డీలక్స్ బస్సులు నడుస్తాయి.
- 10వ తేదీన 40బస్సులు అందుబాటులో ఉంటాయి. ఇందులో నరసరావుపేట నుంచి ఎనిమిది అల్ట్రా డీలక్స్‌లు, మాచర్ల నుంచి సూపర్‌లగ్జరీ ఒకటి, తొమ్మిది ఎక్స్‌ప్రెస్‌లు, చిలకలూరిపేట నుంచి సూపర్‌లగ్జరీలు మూడు, ఎక్స్‌ప్రెస్‌లు నాలుగు, సత్తెనపల్లి నుంచి ఎక్స్‌ప్రెస్ ఒకటి, పిడుగురాళ్ల నుంచి నాలుగు ఎక్స్‌ప్రెస్‌లు, వినుకొండ నుంచి అల్ట్రా డీలక్స్‌లు, ఎక్స్‌ప్రెస్‌లు ఐదు చొప్పున నడుపుతారు.
- 11వ తేదీ మొత్తం 38 బస్సులు నడుపుతుండగా వీటిలో నరసరావుపేట నుంచి ఎనిమిది అల్ట్రా డీలక్స్‌లు, మాచర్ల నుంచి సూపర్‌లగ్జరీ ఒకటి, ఎక్స్‌ప్రెస్‌లు ఏడు, చిలకలూరిపేట నుంచి సూపర్ లగ్జరీలు మూడు, ఎక్స్‌ప్రెస్‌లు నాలుగు, సత్తెనపల్లి నుంచి సూపర్ లగ్జరీ ఒకటి, పిడుగురాళ్ల నుంచి నాలుగు ఎక్స్‌ప్రెస్‌లు, వినుకొండ నుంచి ఐదు చొప్పున అల్ట్రా డీలక్స్‌లు, ఎక్స్‌ప్రెస్‌లు ఉంటాయి.
- 12వ తేదీ మొత్తం 40 బస్సులు నడుపుతుండగా, వీటిలో నరసరావుపేటకు చెందిన ఎనిమిది అల్ట్రా డీలక్స్‌లు, మాచర్లకు చెందిన సూపర్‌లగ్జరీ ఒకటి, తొమ్మిది ఎక్స్‌ప్రెస్‌లు, చిలకలూరిపేట నుంచి సూపర్ లగ్జరీలు మూడు, ఎక్స్‌ప్రెస్‌లు నాలుగు, సత్తెనపల్లి నుంచి ఒక సూపర్ లగ్జరీ, పిడుగురాళ్ల నుంచి నాలుగు ఎక్స్‌ప్రెస్‌లు, వినుకొండకు చెందిన అల్ట్రాడీలక్స్‌లు, ఎక్స్‌ప్రెస్‌లు ఐదు చొప్పున నడుస్తాయి.
- 13వ తేదీ భోగి రోజున నాలుగు బస్సులు ఉంటాయి. వీటిలో నరసరావుపేట, వినుకొండలకు చెందిన అల్ట్రా డీలక్స్‌లు ఒక్కొక్కటి చొప్పున, మాచర్ల, చిలకలూరిపేటలకు చెందిన ఒక్కొక్క సూపర్ లగ్జరీ అందుబాటులో ఉంటాయి.

విరిగిన గేటు.. నిలిచిన నీరు



కారెంపూడి: మేజర్ కాల్వకు నీరు నిలిచిపోవడంతో పెదకొదమగుండ్ల బ్రాంచి కాల్వ పరిధిలో వేలాది రైతులు సాగునీటి కోసం గత పది రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సాగర్ కుడి కాల్వ నుంచి నీరు విడుదలయ్యే చోట గేటు విరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డు పడింది. దీంతో కాల్వకు నీరు నిలిచిపోయింది. గత రెండు రోజులుగా నీటి ప్రవాహానికి పొట్టు గోతాలు అడ్డుపెట్టి విరిగిన గేటును బయటకు తీయడానికి కాల్వ నీటి సంఘం అధ్యక్షుడు పోలయ్య ఆధ్వర్యంలో రైతులు, లస్కర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు నారుమళ్లు ఏతకు వచ్చాయి. దమ్ము చేసి నాట్లు వేయడానికి పొలాలు సిద్ధం అవుతున్నాయి. ఈ దశలో పది రోజులుగా నీరు నిలిచిపోవడంతో పనులన్నీ స్తంభించాయి. ఈ కాల్వ పరిధిలో కారెంపూడి, ఒప్పిచర్ల, కాకానివారిపాలెం, రెడ్డిపాలెం, వేపకంపల్లి, పెదకొదమగుండ్ల రైతుల పొలాలున్నాయి. ఎక్కువగా మాగాణి భూములు, మెట్ట పైర్లు సాగులో ఉన్నాయి.

స్టాంప్ పేపర్‌కూ 'ఆ ధారే'!

- అడ్డగోలు నిబంధనలతో వెండార్లకు తిప్పలు
- ఆధార్ నంబర్ ఇచ్చి, ఓటీపీ చెబితేనే లభ్యం
- కంప్యూటర్, ప్రింటర్ వంటి సామగ్రి తప్పనిసరి
- అసలే అరకొరగా సాగుతున్న అమ్మకాలు

గుంటూరు వెస్ట్ : జిల్లాలోని స్టాంపు వెండార్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం వీరితోపాటు ప్రజలకు కూడా కష్టాలు తెచ్చిపెడుతోంది. గతంలో స్టాంపు కావాలంటే నేరుగా వెండార్ వద్దకు వెళ్లిగానీ, ఎవరినైనా పంపించిగానీ కొనుగోలు చేసుకోవచ్చు. ఇప్పుడు స్టాంపు కావాల్సిన వారే వెళ్లాలి. ఆధార్ కార్డు నంబరు ఇచ్చి వారి ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ చెప్పాలి. అప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేసి స్టాంపు ప్రింట్ తీసి ఇస్తారు. స్టాంపు కోసం కనీసం 15 నిమిషాలకు పైనే పడుతోంది. ఆన్‌లైన్‌లో ఆధార్ ఓపెన్ కాకపోతే స్టాంపు లభించదు.

కంప్యూటర్ తదితరాలు అవసరం

ప్రతి స్టాంపు వెండార్ ఒక దుకాణంతోపాటు కంప్యూటర్, ప్రింటర్, డిస్‌ప్లే ఏర్పాటు చేసుకోవాలి. ఈ వృత్తిలో చాలా మంది పెద్దవారు ఉన్నారు. అరకొర ఆదాయంతో ఇంత సెటప్ ఏర్పాటు చేసుకోవడం సాధ్యం కాదు. చాలామందికి కంప్యూటర్ పరిజ్ఞానం లేదు. పైగా స్టాంపుల విక్రయం అరకొరగానే ఉంటోంది. రోజు సంపాదించే రూ.మూడు నాలుగొందలతోనే జీవిస్తున్నారు. వారందరూ వృత్తికి దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. గడిచిన నెల రోజుల నుంచి కనీసం తీసుకున్న స్టాకులో 5 శాతం కూడా స్టాంపు వెండార్లు విక్రయించలేదు.

ఐజీ కార్యాలయం ఏకపక్ష నిర్ణయం

కొత్త విధానం అమలులో రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖాధికారుల పాత్రే కీలకం. కనీసం జిల్లా రిజిస్ట్రార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు, స్టాంపు వెండార్లకు ముందు చెప్పకుండానే అమలు చేస్తున్నారు. వెండార్ స్టాంపులు విక్రయించాలంటే ముందుగా కంప్యూటర్‌లో లాగిన్ అవ్వాలి. దీనికి ఒక ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయాలి. 15 నిమిషాలు కంప్యూటర్ వాడకపోతే మళ్లీ వ్యవహారం మొదటికే వస్తుంది. పాత తేదీల్లో స్టాంపులు విక్రయించకుండా ఈ విధానం తెచ్చామని ఉన్నతాధికారులు అంటున్నారు. ఆ తరహా కొనుగోలు దాదాపుగా ఆగిపోయింది. పాత తేదీల్లో అగ్రిమెంట్లు రాసుకున్నా అవి పనికిరావు. ప్రస్తుత మార్కెట్ వాల్యూ ప్రకారమే ఫీజులు చెల్లించాలి. తమను సాగనంపేందుకే ఇలా చేస్తున్నారని వెండార్లు వాపోతున్నారు. ఇప్పటికే అధికారులకు తమ సమస్యలను వివరించామని పేర్కొన్నారు.

చాలా ఇబ్బందులు

కొత్త విధానంలో నిబంధనల అమలు సాధ్యం కావడం లేదు. ఆధార్ కార్డు నంబర్, ఓటీపీ చెప్పమంటే ప్రజలు తిరస్కరిస్తున్నారు. రోజుకు రూ.500 కూడా ఆదాయం రాని వెండార్లు... ప్రత్యేకంగా షాపు, కంప్యూటర్, ప్రింటర్ వంటివి ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందికరమే. చాలా మంది స్టాంపుల విక్రయాలు ఆపేస్తున్నారు. ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు అందించాం.

– షేక్ రషీద్, స్టాంపు వెండార్ల సంఘం జిల్లా జేఏసీ చైర్మన్

న్యూస్‌రీల్

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట: జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో ఖాళీగా ఉన్న 17 ఉద్యోగాల భర్తీకి ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ తరఫున కాంట్రాక్ట్ పద్ధతిపై నియామకాలు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలు, దరఖాస్తు ఫారాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో చూడాలని ఆయన సూచించారు.

సత్తెమ్మ తల్లి దేవాలయానికి బస్సు సౌకర్యం



అచ్చంపేట: సత్తెమ్మతల్లి దేవాలయానికి ఈనెల ఐదో తేదీ నుంచి ప్రతి ఆదివారం మాదిపాడు ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి అడవి మార్గంలో రెండు సార్లు ఆర్టీసీ బస్సును నడపనున్నట్లు సత్తెనపల్లి డిపో మేనేజరు జీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషితో ఆలయ అభివృద్ధికి రూ.62లక్షలు కేటాయించారు. నిధులతో గ్రావెల్ రోడ్డు వేశారు. ఎకో పార్కు నిర్మాణానికి సన్నాహాలు చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భక్తులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పనులను పునరుద్ధరించి, ఆలయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సత్తెనపల్లి డిపో మేనేజరును సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ప్రతి ఆదివారం ఉదయం 8 గంటలకు ఒకసారి, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్యలో మరోసారి ఆర్టీసీ బస్సును నడపనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు.

కౌలు రైతులకు పంట రుణాలు

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలోని కౌలు రైతులు పంట రుణాలు తీసుకునేందుకు సమీపంలోని బ్యాంకులను సంప్రదించాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. వారికి రుణాలివ్వాలని జిల్లాలోని బ్యాంకులు, ప్రాంతీయ కార్యాలయాలకు మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. ఇబ్బందులు ఎదురైతే 0863-223 2953 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. పొలం యజమానులు పంట రుణం తీసుకోకపోతే తప్పనిసరిగా కౌలు రైతులకు ఇస్తారని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకు 5,667 మంది కౌలు రైతులకు రూ.36.80 కోట్లు పంట రుణాలు మంజూరు చేశామని వివరించారు.

ఎయిడెడ్ స్కూల్‌ను సందర్శించిన డీజీపీ



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని కృష్ణానగర్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను శనివారం డీజీపీ, పాఠశాల పూర్వ విద్యార్థి సీహెచ్ ద్వారకా తిరుమలరావు సందర్శించారు. 1974లో ఇదే పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన ఆయన్ను సహచర పూర్వ విద్యార్థులు సన్మానించారు. సహచర పూర్వ విద్యార్థులు, పాఠశాల పాలకవర్గ ఆహ్వానంపై పాఠశాలకు యూనిఫాంతో డీజీపీ వచ్చారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఇలా వచ్చినట్లు చెప్పారు. పాఠశాలలో చదివిన సమయంలో ఉన్న అడ్మిషన్ రిజిస్టర్‌లో తన పేరు, వివరాలను ఆయన చూసుకున్నారు. కోబాల్ట్‌పేటకు చెందిన చిన్ననాటి మిత్రుడు షరీఫ్‌ను పలకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డాక్టర్ ఓవీ రమణ, పాఠశాల కరస్పాండెంట్ తూములూరి శ్రీరామమూర్తి, కార్యదర్శి తూములూరి సమ్మోహిత్, మాజేటి గురవయ్య కళాశాల ప్రిన్సిపాల్ మాధవపెద్ది విజయలక్ష్మి, హెచ్ఎం చిలుకూరి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టు గ్రేడ్-2 మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో ఫార్మాసిస్టు గ్రేడ్-2 పోస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేసినట్లు మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్ర శనివారం తెలిపారు. ఫైనల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీలోపు తమ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

క్లుప్తంగా

యాచకురాలి మృతదేహానికి అంత్యక్రియలు



కర్లపాలెం: గ్రామ సచివాలయానికి సమీపంలో ఉన్న బస్టాండ్‌లో మృతి చెందిన యాచకురాలికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. పేరు తెలియని ఓ యాచకురాలు బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి మృతి చెందటంతో స్థానికుల సమాచారం మేరకు గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి కార్యదర్శి సునీత బస్టాండుకు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

రెండు లారీలు ఢీ

ముగ్గురికి గాయాలు

కర్లపాలెం: ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొనటంతో ముగ్గురికి గాయాలైన సంఘటన శనివారం కర్లపాలెం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్లపాలెం వైపు టిప్పర్ లారీ, చందోలు వైపు వెళుతున్న మినీ లారీ కర్లపాలెం తుంగభద్ర డ్రెయిన్ సమీపంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మినీ లారీ బోల్తాపడటంతో అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. బాధితులను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

పోలీసుల అదుపులో నిందితుడు



మార్టూరు: రోజురోజుకూ చిన్నారులు, మహిళలపై లైంగిక దాడులు ఎక్కువవుతున్నాయి. ఓ బాలికపై 30 ఏళ్ల వివాహితుడు మద్యం మత్తులో లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం మండలంలోని ఇసుక దర్శి గ్రామంలో కలకలం రేకెత్తించింది. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. గ్రామంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో బాలిక (11) నాలుగో తరగతి చదువుతోంది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పాఠశాల సమీపంలో నివసించే ఓ యువకుడు ఆ బాలికను తన ఇంట్లోకి పిలిచి తలుపులు వేసుకున్నాడు. గదిలో నుంచి బాలిక అరుపులు విన్న సహచర విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులను, స్థానికులను అప్రమత్తం చేశారు. అందరూ కలిసి నిందితుడు మారెళ్ల నాగరాజు ఇంటి ముందు చేరి కేకలు వేయడంతో కొంతసేపటికి అతను బాలికను ఇంటి వెనక వైపు గల మరో మార్గం నుంచి బయటకు పంపించాడు. బాలిక బంధువుల సమాచారంతో పోలీసులు నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బాలిక నాయనమ్మ వెంకాయమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెరువు కట్టపై టీడీపీ నేతల కన్ను

- భారీగా చెట్లు నరికివేత
- టీడీపీలోని రెండో వర్గం ఫిర్యాదు
- అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి



కట్టపై చెట్లను నరికివేస్తున్న కూలీలు

నరసరావుపేట రూరల్: మండలంలోని కాకాని చెరువు కట్ట మీద చెట్లను టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా నరికి వేస్తున్నారు. కాకాని–ముత్తనపల్లి రోడ్డులోని చెరువు కట్ట మీద భారీ చెట్లు ఉన్నాయి. వందల సంఖ్యలో కట్టకు రక్షణగా ఉన్నాయి. 20 సంవత్సరాల వయస్సు గల తుమ్మ, వేప, సుబాబుల్ చెట్లు ఇందులో ఉన్నాయి. వీటిపై టీడీపీ గ్రామ నాయకుల కన్ను పడింది. శనివారం చెట్ల నరికివేతను ప్రారంభించారు. గ్రామంలోని టీడీపీకి చెందిన రెండో వర్గం దీనిపై పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించింది. ఆయన అక్కడకు చేరుకొని నరికివేతను అడ్డుకున్నారు. కోటప్పకొండ ప్రభ నిర్మాణానికి అయ్యే ఖర్చుల కోసం నియోజకవర్గ ప్రజాప్రతినిధి చెట్లను నరికి, విక్రయించమని చెప్పాడని టీడీపీ నాయకులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫోన్‌లో ప్రజాప్రతినిధి సంప్రదించగా తాను ఎవరికీ చెప్పలేదని తెలిపాడు. దీంతో అటవీశాఖ, మైనర్ ఇరిగేషన్ అధికారులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. 200 ఎకరాల చెరువుకు రక్షణగా ఉండే చెట్లను నరికివేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించడంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ తరలింపు



అధికారులు నిలిపిన గ్రానైట్ లోడు లారీ

నకరికల్లు: నిబంధనలు పాటించకుండా గ్రానైట్ తరలిస్తున్న లారీలను కమర్షియల్ టాక్స్ అధికారులు శనివారం నిలిపి వేశారు. ప్రకాశం జిల్లా నుంచి తెలంగాణ, మహారాష్ట్ర వైపు భారీ లారీలలో గ్రానైట్ రాళ్లను తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న సీటీఓ అధికారులు మండలంలోని అడ్డరోడ్డుకు సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై తనిఖీలు చేపట్టారు. హైవేపై వస్తున్న లారీలను గుర్తించి వారి వద్ద ఉన్న పత్రాలను తనిఖీ చేశారు. దాదాపు గంటల తరబడి వాహనాలను నిలిపివేశారు. తరువాత వేబ్రిడ్జి వద్ద కాటా వేసి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించినట్లు సమాచారం.

ఊరికాని ఊరొచ్చి.. ప్రాణం విడిచాడు

అపార్టుమెంట్ పైనుంచి పడి కార్మికుడి మృతి

చిలకలూరిపేట టౌన్: పొట్టకూటి కోసం ఊరికాని ఊరొచ్చి ఓ వ్యక్తి ప్రాణం పోగొట్టుకున్న విషాద సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న అమృత దాబా వెనుక అపార్టుమెంట్ పనులు చేస్తున్నారు. నరసరావుపేట వెంగళ్‌రెడ్డినగర్‌కు చెందిన సిరివెరి కోటేశ్వరరావు(35) శనివారం సెంట్రింగ్ పనులకు వచ్చాడు. మధ్యాహ్నం భోజనం చేసి నాలుగో అంతస్తులో విశ్రమించాడు. కొద్దిసేపటి తర్వాత నిద్రలేచి కాలకృత్యాల నిమిత్తం మూడో అంతస్తుకు రాగానే ప్రమాదవశాత్తు అపార్టుమెంట్ పైనుంచి కిందికి జారి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


నదిలోకి దూకిన యువకుడు

- కాపాడటానికి వెళ్లిన పోలీసులు
- ముప్పతిప్పలు పెట్టి పరారీ



ఒడ్డుకు రావాలని ప్రకాశం బ్యారేజ్‌పై నుంచి సూచిస్తున్న పోలీసులు

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ రైలింగ్ నుంచి కృష్ణా నదిలోకి ఓ యువకుడు శనివారం దూకాడు. ఆత్మహత్య చేసుకున్నాడని భావించి కాపాడేందుకు వచ్చిన పోలీసులను ముప్పుతిప్పలు పెట్టి పారిపోయాడు. వివరాలు.. కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ 14వ ఖానా వద్ద దిగువ ప్రాంతంలో యువకుడు నీటిలోకి దూకాడు. అది గమనించిన ప్రజలు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. యువకుడు పైకి తేలకుండా నీటిలోనే ప్రకాశం బ్యారేజ్ కిందకు వెళ్లడంతో పైనున్న వారికి అతడు కనిపించలేదు. ఆత్మహత్య చేసుకున్నాడని భావించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా సదరు యువకుడు నీటిలో తేలియాడుతూ కనిపించాడు. సుమారు 50 అడుగుల ఎత్తు నుంచి దూకడంతో నీటి అడుగున ఉన్న కాంక్రీట్ ఫ్లోరింగ్ తగిలి మృతి చెంది ఉంటాడని భావించారు. 20 నిమిషాల అనంతరం ఆ యువకుడు ఈత కొట్టడంతో పోలీసులు పైకి రావాలని సూచించారు. పోలీసులను చూసి కంగారు పడిన అతడు దిగువ యాప్రాన్ నుంచి కృష్ణానది గేట్లు ఎక్కాడు. మళ్లీ ఎగువ ప్రాంతంలో ఈదుకుంటూ కిందికి దిగి ప్రకాశం బ్యారేజ్ గేట్లకు కిందభాగంలో ఉన్న సొరంగ మార్గం ద్వారా విజయవాడ వైపు వెళ్లిపోయాడు.



నీటిలో తేలియాడుతున్న యువకుడు

పట్టాభిషేక మహోత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు జరగనున్న మహోత్సవాలను శ్రీ శృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీపీఠాధిపతులు శ్రీగంభీర్ ఆనంద భారతీ స్వామి ప్రారంభించారు. అనంతరం శ్రీమద్రామాయణ పారాయణం మొదలైంది. 24 వేల శ్లోకాలకు హోమం, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామ సేవాసమితి నిర్వాహకులు సోమయాజులు, పాలక మండలి సభ్యులు కొరపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట రూ.8 లక్షల మేరకు మోసం

- ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన ఆర్మీ ఉద్యోగి దగా
- మనస్తాపంతో బాధిత మహిళ ఆత్మహత్యాయత్నం



నిందితుడు ఆళ్ల రామకృష్ణ

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఇన్‌స్టాగామ్‌లో ఏర్పడిన పరిచయంతో ఆర్మీ ఉద్యోగి చేతిలో నగరానికి చెందిన మహిళ బండి ఆశ (35) మోసపోయారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బండి ఆశ పిల్లల చదువుల కోసం నగరానికి వచ్చారు. ఆర్మీలో పనిచేసే ఆళ్ల రామకృష్ణ ఇన్‌స్టాగామ్‌లో ఆమెకు పరిచయం అయ్యాడు. ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ పశ్చిమ బెంగాల్‌కు రావాలని నమ్మబలికాడు. ఆమె వెళ్లాక రూ.8 లక్షలు తీసుకున్నాడు. 11 రోజుల పాటు అతనితో కలిసి ఆమె పశ్చిమ బెంగాల్‌లో ఉన్నారు. ఉద్యోగం కోసం ఎన్నిసార్లు అడిగినా మాట దాటవేశాడు. ప్రస్తుతం ఆర్మీలో పరిస్థితులు బాలేదంటూ రామకృష్ణ తన భార్య పేరుతో విజయవాడకు రైలు టికెట్ తీసి ఆశను బలవంతంగా పంపించేశాడు. తరువాత ఎన్నిసార్లు అడిగినా రామకృష్ణ స్పందించలేదు. దీంతో రామకృష్ణ స్వగ్రామం గుంటూరు జిల్లా పొన్నూరు వెళ్లి నగదు కోసం ఆమె అడిగారు. అసభ్యంగా మాట్లాడుతూ దాడి చేసేందుకు యత్నించడంతో భయపడి విజయవాడకు వచ్చేశారు. అనంతరం నవంబర్ 25న స్పందనలో ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 5వ తేదీన ఈ కేసును దర్యాప్తు నిమిత్తం గుణదల పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. గుణదల పోలీసులు కేసు నమోదు చేసి రామకృష్ణను పిలిపించి కౌన్సెలింగ్‌కు సైతం పంపించారు. అయినప్పటికీ డబ్బులు ఇవ్వకపోగా నోటికి వచ్చినట్లు మాట్లాడాడు. ఆమె మనస్తాపానికి గురయ్యారు. ఇంట్లో సైతం గొడవలు జరగడంతో మురళీనగర్‌లోని నివాసంలో శనివారం ఆమె ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తనకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదని ఆమె పేర్కొన్నారు. తన నగదు తిరిగి ఇవ్వాలని కోరారు. ఆశ ఆస్పత్రి పాలవ్వడంతో ఆమె ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

తక్కువ ధరతో వేగంగా ఇళ్లకే వస్తువుల డెలివరీ

ఆర్టీసీ జిల్లా అధికారి శ్రీనివాసరావు



డోర్ డెలివరీలను ప్రదర్శిస్తున్న ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు, ఉద్యోగులు

నరసరావుపేట: ఆర్టీసీ ప్రజా రవాణా సంస్థ నిర్వహిస్తున్న కార్గో సర్వీసులో నూతనంగా చేపట్టిన డోర్ డెలివరీ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు కోరారు. డోర్ డెలివరీ సౌకర్యానికి తగిన ప్రచారం కల్పించే ఉద్దేశంతో ప్రతి ఉద్యోగి మూడు పార్శిళ్లను పంపించాలనే సంస్థ ఆదేశాలను అనుసరించి శనివారం డిపోలోని జిల్లా కార్యాలయంలో వాటిని పంపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సర్వీసు విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రైవేటు కొరియర్ సర్వీసుల కంటే తక్కువ ధరకే చాలా వేగంగా ప్రజలకు వస్తువులు, సరుకులు, లెటర్లు, ప్యాకెట్లు, మందులు, ఆయిల్స్, నిత్యావసరాలు డెలివరీ చేస్తున్నామని తెలిపారు. డోర్ డెలివరీ సౌకర్యాన్ని గత నెల 20వ తేదీ నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు జిల్లాల కమర్షియల్ అధికారి డి.ఆదినారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయాలలో కుల గణన వివరాలు ప్రదర్శించాలి: జేసీ



సమావేశంలో జేసీ సూరజ్, డీఆర్వో మురళి, అధికారులు

నరసరావుపేట: గ్రామ, వార్డు సచివాలయాలలో ఎస్సీ కులగణన వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుల గడువు పూర్తయినందున త్వరలోనే నూతన కమిటీని నియమిస్తామని పేర్కొన్నారు. ప్రతి నెలా నాలుగో శనివారం జిల్లా కలెక్టరేట్‌లో పౌరసేవల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఏ.మురళి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివనాగేశ్వరరావు, జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవయవాలు, నేత్ర దానంతో సజీవం

ఆదర్శంగా నిలిచిన మునెమ్మ



మునెమ్మ(ఫైల్)

బొల్లవరం(ముప్పాళ్ల): శరీరం, నేత్ర దానంతో ఆదర్శంగా నిలిచిందో మాతృమూర్తి. మండలంలోని బొల్లవరం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు, ప్రజాతంత్ర మహిళా సంఘంలో చురుకుగా పనిచేసిన కళ్లం మునెమ్మ(88) శనివారం మృతి చెందారు. ఆమె భర్త సత్యనారాయణరెడ్డి కూడా పార్టీలో పనిచేశారు. చనిపోయిన తర్వాత మునెమ్మ కోరిక మేరకు ఉదయాన్నే శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కళ్లను సేకరించారు. అనంతరం భౌతికకాయాన్ని విజయవాడలోని నిమ్రా వైద్య కళాశాల వైద్యులు స్వాధీనం చేసుకొని అంబులెన్స్‌లో తీసుకెళ్లారు.తొలుత సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు మునెమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



మునెమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వైఎస్సార్ సీపీ కార్యకర్తలను చితకబాదుతున్న సీఐ!

అధికార పార్టీ ఒత్తిళ్లతో దాష్టీకం



గాయపడిన మణి చౌదరి

పిడుగురాళ్ల: అధికార పార్టీ ఆదేశాలతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై పిడుగురాళ్ల సీఐ దాష్టీకాలు మితిమీరిపోతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు తెలుపుతున్న వివరాల మేరకు.. గతేడాది డిసెంబర్ 21న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని జానపాడులోని సొంత స్థలంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సూరాబత్తుల మణి చౌదరి (బుల్లెట్ మణి) ఫ్లెక్సీని ఏర్పాటు చేశాడు. దీన్ని తొలగించాలని సీఐ హుకుం జారీ చేయడంతో తొలగించారు. వెంటనే దాని స్థానంలో టీడీపీ నాయకులు మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అది చిరిగిపోయింది. అయితే, దాన్ని చించారన్న నెపంతో బుల్లెట్ మణిని డిసెంబర్ 28న పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. డార్క్ రూమ్‌కు తీసుకుని వెళ్లి సీఐ వెంకట్రావు బూతులు తిట్టాడు. రెండు చేతుల మీద హంటర్‌తో విచక్షణారహితంగా కొట్టడంతో ఎడమ చేతి ఎముకలు చిట్లిపోయాయి. చేతులు చచ్చుబడిపోవడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో బుల్లెట్ మణి చికిత్స పొందుతున్నాడు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉపాధ్యాయుడి ప్రతిభ

- ఆర్డినో ఫైర్ ఫైట్ రోబోట్ ప్రదర్శన
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పరికరంతో ఉపాధ్యాయుడు మణికంఠ

క్రోసూరు: జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో మండలంలోని దొడ్లేరు జెడ్పీ పాఠశాల సైన్సు ఉపాధ్యాయుడు వై.మణికంఠ ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం ఎ.పద్మలత శనివారం తెలిపారు. ఆయన వ్యవసాయానికి సంబంధించిన ఆర్డినో ఫైర్ ఫైట్ రోబోట్ అనే పరికరాన్ని ప్రదర్శించినట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి సమక్షంలో పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. ఈనెల 7న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉపాధ్యాయుడు వై.మణికంఠ పాల్గొనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన్ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించినట్లు ఆమె పేర్కొన్నారు.